# అన్న

ఊరివెలుపల కాలువగట్టుమీద, చింతచెట్టుక్రింద నల్లరాతి మీద కూర్చున్నాడు అన్న. గోళ్లు గిల్లుకొంటున్నాడు. కళ్ల వెంట నీళ్లు గారుతున్నాయి. కాలువలో జలం ప్రవహిస్తూ వుంది. అతని కాళ్లు వణుకుతున్నాయి. పిచ్చిగా, ప్రవహించే నీటిని చూస్తున్నాడు. వెనుక గుడిలో గంటలు వినబడు తున్నాయి. తమ్ముడి ఆలోచనే గుండెలో పోటు పుట్టిస్తూ వుంది. బాధను తట్టుకోలేక పోతున్నాడు. అన్న కాళ్లు అప్రయత్నంగా చింతచిదుగులు ఆకులు ఎండు డొల్లలు తొక్కుకొంటూ రాత్రి వానకు మెత్తబడివున్న నేలలోకి దిగుతూ వుంది.

కాలువ గట్టుమీదికి పశువులు తోలుకునచ్చిన పిల్లలు— జీతగాళ్లు—అన్నను చూచి 'అదుగో రాడీ!' అంటూ ఆనందంతో వెర్రిగా గగ్గోలెత్తిపోయారు.

వాళ్లంతా తనవైపే వస్తుంటే చూచిన అన్న ఊళ్లోకి పరుగు మొదలుపెట్టాడు. తేపతేపకూ వెనక్కు చూస్తున్నాడు. వెనుక వాళ్లు పరుగెడుతూ వస్తున్నారు.

వెనుకనుంచి పిల్లలు గొడ్డు మళ్లించే చేతికర్రలు విసిరి వేశారు. అవి అన్నకు తగలలేదుగానీ విపరీతంగా భయం కలిగించాయి.

ఊరి మొగదల సావిళ్ల ప్రక్క చాలా గడ్డివాము లున్నాయి. వాటిని చూడగానే అన్నకు ప్రాణం లేచివచ్చింది. అతను రెండు సావిళ్లు మధ్యగా వెళ్లాడు. అక్కణ్ణుంచి వెను దిరిగాడు. వాళ్లకు కనిపించకుండా గడ్డివాముల దగ్గరకు పోయాడు. మనిషి దూరేంత సందుకూడా లేని రెండు వాముల మధ్య చొరబడ్డాడు. లోపలికిపోయి కదలకుండా, మునగరదీసు కూర్చున్నాడు. ఆతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గడ్డిపరకల గాలికి కదిలితే వచ్చినధ్వనిలో కలిసిపోతున్నాయి. గడ్డి వరకలమీంచి జారి నాలుగయిదు నీటిబొట్లు అన్నమీద పడ్డాయి.

'ఏడిరీడు!'

'ఎక్కడరీడు!'

జీతగాళ్లు ప్రశ్నించుకొన్నారు. అన్న కనిపించలేదు. వాళ్లు ఊళ్లోకి పరుగెత్తారు.

రాత్రి వానవల్ల నేలంతా రొచ్చుగా వుంది. కర్మసాక్షి నిద్రలేచి రావలసిన సమయందాటి అప్పుడే నాలుగు గంటలయి పోయింది. ముసురు పట్టినట్లుంది. చెట్టుకొమ్మల మీంచి గాలి తోలితే నీటి బొట్టులు పడుతూనే వున్నాయి.

చిల్లకంపలమీద సాలెపురుగు గూటిమీద నిలచిన నీటి బొట్లు సూర్యకిరణాలు పడకపోయినా మెరుస్తున్నాయి. రాత్రి చలిపుట్టి దుప్పటి కప్పుకొన్న ఊరు నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకోని మనిషిలాగా వుంది.

నెలక్రితం పిక్‌నిక్ వస్తూ కాలేజీ విద్యార్థులు అన్నను సామాన్లు మోసేందుకు వెంట తీసుకువచ్చారు. నాలుగు

రోజులక్రితం కాలువ గట్టుమీద దేవాలయం చూపించటానికి తమ్ముణ్ణి తీసుకువచ్చాడు అన్న.

రైలుదిగి వస్తూ సిగరెట్టు పీక కాల్చుకొని గాలిలోకి తీవిగా పొగ వదలుతున్న అన్న వెంట తమ్ముడు చేతులు ఊపు కొంటూ నడుస్తున్నాడు.

పొలంనుంచి వస్తున్న జీతగాడు వాళ్లకు తోడుగావచ్చి 'మీవూరుమంది?' ప్రశ్నించాడు. అన్న చెబితే జీతగాడు అడిగాడు.

'సిగరెట్టిస్తా?!'

'ఆఁ!'

'ఈ!'

అన్న జేబులోంచి సిగరెట్టు పీక ఒకటి తీసి ఇచ్చాడు.

'కాల్చిం దొద్దు!'

'అన్నీ యియ్యే!'

జేబులో చేయిపెట్టి సిగరెట్ పీకలన్నీ తీసి చూపించాడు. రకరకాల సిగరెట్లు! అన్నీ సగం కాల్చినవే!

'ఎంగిలి పీకలు! ఎంగిలి పీకలు!'

జీతగాడు హేళన చేస్తున్నాడు.

'ఎగతాళి చెయొద్దు! ఆఁ! నే నసలే రాడీని!'

జీతగాడు ఇంకా ఎక్కువ చేశాడు.

'ఎంగిలి పీకల రాడీ! ఎంగిలి పీకల రాడీ!'

'పోరా పుల్లాయ్! నీతో నాకేంది!'

'పుల్లాయ్ గిల్లాయ్ అనొద్దురోయ్ దొమ్మలు బగులుతాయ్!'

'ఏడిశావ్ లే పోవోయ్ పుల్లాయ్!'

జీతగాడికి కోపం వచ్చింది. గొడ్డుగాచే కర్ర చాచి నెమర ంతమీద వేశాడు. 'చచ్చా ర్రోయ్!' అంటూ కూల డ్డాడు అన్న. తమ్ముడికి కోపంవచ్చింది. రాయితీసుకు కొట్టాడు. జీతగాడి తలచిట్లి రక్తం వచ్చింది. రక్తం చూచుకొనే రికి వళ్లు మండిపోయింది. ఉండు నీపని చెబుతా!' అంటూ ర్ర ఎత్తాడు. కర్ర దెబ్బ పడితే తమ్ముడు చచ్చిపోతాడని భయం ప్రాణ భయంతో అన్న అడ్డంపోయాడు. పెద్ద దెబ్బలాట!

అన్నదమ్ములు తనని చంపేస్తారేమో నని భయంతో కర్ర పారేసి ఊళ్లోకి పరుగెత్తాడు జీతగాడు.

జీతగాళ్లు ఊళ్లో అన్నకోసం వెతుకుతున్నారు. ఎటు పోయాడో ఎక్కడ నున్నాడో తెలియలేదు. ఎక్కడికి పోతాడు!! వెతుకుతున్నారు.

గాంధీ బొమ్మదగ్గర సిమ్మెంటు గచ్చుమీద కూర్చుని పంచాంగం, వానలు, తొలకరి, పంటలు—అనేక సంగతులు చర్చించుకొంటున్నారు రైతులు.

రెండు వాముల మధ్య ఇరుక్కొని కూర్చున్న అన్న వణికి పోతున్నాడు. జీతగాళ్లు ఒక ప్రక్కనుంచి వస్తే రెండో ప్రక్కకు పరుగెత్తవచ్చు. రెండుప్రక్కలా వస్తే? అన్న వణికి పోతున్నాడు.

ఆ భయంతో అకారణంగా మరోభయం తోడయింది. రెండువాముల మధ్య పొడిగా వెచ్చగావున్న స్థలంలో హాయిగా ఉన్నాడు. ఎవరయినా వాములకు నిప్పుపెడితే! తల్లడిల్లి పోతున్నాడు.

పదమూడేళ్ళ పూర్వం తను ఎక్కడ పుట్టాడో అమ్మ నాన్న లెవరో, ఊరు పేరు లేమిటో తమ్ముడు తన తమ్ముడు అవునో కాదో అన్నకు తెలియదు.

లోకం తెలిసిందగ్గర్నుంచి తమ్ముడు తనతోనే వుంటున్నాడు ఇద్దరికీ ప్లాటుఫారం తల్లీ దండ్రీ ఇల్లు వాకిలీ!

పంపులదగ్గర అన్నంమూటలు విప్పుకొని తినే పల్లెవాళ్ళ పెట్టిన ముద్దలు, కేంటిన్‌లో టిఫిన్ తినేవాళ్లు వేసిన ఎత్తివేతలు పారేసిన విస్తరలో మిగిలిపోయిన ముక్కలు, తిని వాళ్ళ చనిపోలేదు.

ప్లాటుఫారం ఫెన్సింగుక్రింద మునగరదీసుకొనో, ఓవర్ బ్రిడ్జీ మూలల్లో ఒదిగో, వెయిటింగ్‌హాల్ బల్లలక్రింద నక్కో క్లోక్‌రూంషెడ్ క్రింద ముడుచుకొనో, కాళీ వాగన్‌ల లోపలో వాగన్‌షెడ్ బేళ్ల మధ్య ఎక్కడో పడుకొని నిద్రపోయారు

అన్నం తిని పల్లెవాళ్లు పారేసిన గుడ్డ ముక్కల ఏరుకొనీ, లైసెన్సు కూలీలను అడుక్కొనీ, ప్రయాణీకులన యాచించీ, గుడ్డలు సంపాదించి చలికీ ఎండకీ వళ్లు దాచుకో గలిగారు.

అన్నం తింటున్న పల్లెటూరి తల్లిని అన్నం అడిగితే, అన్న అయిపోవటంవల్ల ఆమె డబ్బులిస్తే — డబ్బులవల్ల తినేది కొనుక్కోవచ్చు నన్నజ్ఞానం ఏర్పడ్డతర్వాత, డబ్బులు అడుక్కో వటం ప్రారంభించారు.

ఆ రోజు అన్నదమ్ములిద్దరూ సాయంకాలం వసూలయిన చిల్లరంతా ఒక్కచోట పోసి లెక్కపెట్టుకొంటుంటే, అంత

నిపెడుతున్న నల్లముఖం వాళ్ల దగ్గరకువచ్చి చిల్లరంతా తీసుకొని జేబులో వేసుకొని నవ్వుతూ వెళ్లిపోంది.

అతనెవరో ఎందుకలా తీసుకుపోయాడో అర్థంకాక అన్నదమ్ములిద్దరూ వాటేసుకొని ఏడ్చారు. ఆకలి కడుపులతో మళ్లీ అడుక్కోవటానికి వెళ్లారు.

ప్లాటుఫారంమీద అడుక్కొంటున్న తిండి లాక్కుపోయేవాళ్లు బిచ్చగాళ్లు. చిల్లర డబ్బులు గుంజుకు పోయేవాళ్లు రౌడీలు. చేతిలో తినుబండారాలు తన్నుకుపోయేకాకులు. కాకుల మూకలు, కాకుల మూకలవంటి లోకులు అన్నకు బాగా తెలుసు.

గార్డు బూటుకాలు, కూలీ చెప్పులేని కాలు, ప్రయాణీకుల చెప్పుకాలు అన్న వీపుకు తెలుసు, గడియారాల చేతులు, ఉంగరాల చేతులు అన్న చెంపలకు తెలుసు. ప్రయాణీకుల తిట్లు, బిచ్చగాళ్ల బండబూతులు చెవులకు తెలుసు. ఎందరి కాళ్లూ చేతులు అనురాగం చూపించాయో, శరీరంలో ఉన్న రక్తం రుచి చూచి, చూస్తూ కర్మసాక్షిలా వూరుకొంది.

అన్నదమ్ములు బ్రతుకుతున్నారు. ధర్మంచేసిన వాళ్ల అన్నం, డబ్బులూ; అధర్మం చేసినవాళ్ల దెబ్బలు తిట్లూ, తిండీ తిప్పలూ తింటూ బ్రతుకుతున్నారు. అన్నకు బ్రతుకుమీద వెగటు పుట్టలేదు. అంతకంటే వేరే బ్రతుకు ఉందని అతనికి తెలియదు. అదే బ్రతుకని అన్న విశ్వాసం.

నాలుగేళ్ల క్రితం ప్లాటుఫారంమీద పుస్తకాలు పేపర్లు అమ్మే కుర్రాడుగా కుదిరాడు. ఎన్ని అమ్మితే అంత వస్తూ వుండేది. శ్రమపడి అమ్ముతూ వుండేవాడు.

ఒకరోజు ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో కూర్చున్న పుణ్యాత్ముడు అన్నను పిలిచాడు. పుస్తకాలు చూస్తున్నాడు ఆశతో ఉన్నాడు అన్న.

ఆ వ్యక్తి సిగరెట్లు తీసుకురమ్మని రూపాయి ఇచ్చాడు అన్న సిగరెట్లు తీసుకొని తిరిగి వచ్చేసరికి రైలు బైలుదేరింది పరుగెత్తుతూ వెళుతూవుంటే ఫస్టుక్లాసు కంపార్టుమెంట దూరంగా పరుగెత్తుతూ వెళుతూవుంది.

'రైలు క్రిందపడి చస్తావేంరా.'

ఎవరో అన్నను పట్టుకొని ఆపారు.

అన్న తన్నుకులాడాడు.

ఏమీ ఎరుగని నంగనాచిలా వయ్యారాలు పోతూ పోతూ వుంది రైలు.

వెళ్లిపోయిన రైలువంక చూస్తూ, చేతిలో ఉన్న సిగరెట్లు చేతిలో లేని పుస్తకాలు తలుచుకొని, గుండె తరుక్కుపోయి ఆవురుమని ఏడ్చాడు అన్న.

పుస్తకాలు అమ్మేపని పోయింది. ఏడుస్తూ కాలం గడుపు తున్న అన్నకు మరో ఉద్యోగంవచ్చి ఏడ్పు పోగొట్టింది.

గారెలు చక్రాలు బోండాలు రైలులో అమ్మేపని!

భుజంమీద పెట్టె పెట్టుకొని, నాలుగు ప్రక్కల గాజు పలకల్లోంచి కనిపించే తినుబండారాలు, పై చెక్కమూత తీసి, అమ్ముతూ, వచ్చిన డబ్బులు పెట్టెలో ఒకమూల వేసుకుంటూ రైలు పొడుగునా అరుచుకొంటూ అమ్ముతూ తిరిగేవాడు అన్న.

రైలు వచ్చి ఆగింది. అన్న త్వరత్వరగా అమ్ముతున్నాడు.

ఎదురుగా ఎవరో పరుగెత్తుకొంటూ వస్తున్నాడు. వెనుక నుంచి పోలీసులు 'పట్టుకోండి పట్టుకోండి' అని వెంటబడ్డారు.

చూస్తూ వుండగానే ఎదురైనవాళ్లను తప్పుకొంటూ వస్తున్న వ్యక్తి అన్నను పడేసి, జనాన్ని తోసేసి ఫెన్సింగ్, దూకేసి వెళ్లిపోయాడు.

అన్న లేచిచూస్తే భుజంమీద పెట్టెలేదు. ప్లాటుఫారం మీద లేదు. రైలు పట్టాకి ప్లాటుఫారంకి మధ్య పడివుంది.

రైలు వెళ్లిపోయాక చూస్తే, గాజు పలకలు పగిలిపోయి, తినుబండారాలు చెల్లాచెదురుగా, పట్టా ప్రక్క మురికిలో చెత్తలో చీదర చీదరగా పడివున్నాయి. డబ్బులు చిందర వందరగా పడిపోయాయి.

అన్న వాటిని అలా చూస్తూవుంటే పేగుల్లో ఇనుపముళ్ల పదివంటిది ఉంగరాలు చుట్టికుపోయి, గుండెల్లోకి పోతు న్నట్లయింది. నెత్తి బాదుకొంటూ జుత్తు పీక్కొంటూ లబో లబోమని ఏడ్చాడు.

ఏడ్పు ఎవరూ వినకపోలేదు. కేంటిన్ మేనేజర్ విన్నాడు. కాలుగు తన్నాడు. తగిలేశాడు.

రాత్రి, క్రాసింగ్ బ్రిడ్జి మూలలో తమ్ముణ్ణి కడుపులోకి లాక్కొని ఆకలి మరచిపోయి ఏడుస్తూ పడుకొన్నాడు అన్న.

మార్చినెలలో అన్న ఐస్ ఫ్రూట్‌లు అమ్మేపనిలో కుదిరాడు. ఎన్ని ఎక్కువ అమ్మితే అంత ఎక్కువ డబ్బు వస్తుంది. డబ్బునుబట్టి కడుపులో ఆకలి!

అప్పుడప్పుడు తమ్ముడికి ఒకటో రెండో ఇచ్చేవాడుగానీ తాను తినేవాడుకాడు.

మార్కెట్ దగ్గర, స్టేషన్ ముందు, బస్‌స్టాండ్‌లో ఐస్ ఫ్రూట్‌లు బాగా అమ్ముడుపోతాయి ఎప్పుడూ, రీసెస్‌లో మాత్రం స్కూల్సదగ్గర మంచి అమ్మకం.

పదిరోజుల్నుంచి హైయర్ ఎలిమెంటరీ స్కూలుదగ్గర రీసెస్‌లో అమ్ముకొంటున్నాడు.

అక్కడ చిన్న అంగడి పెట్టుకొని ఒక ముసలమ్మవుంది పెట్టె అంగడిలో రకం రకాల చిరుతిళ్లు వున్నాయి.

సంవత్సరం పొడుగునా ఆమెకెంతో రాబడివుంటుంది అన్న అక్కడ ఐస్ ఫ్రూట్‌లు అమ్మకపోతే, ఆమెకు మరింత రాబడి వుంటుంది.

'నువ్వుకూడా నాలాగా రోజంతా ఇక్కడే కూర్చుంటే కూర్చో! సరిగ్గా రీసెస్‌లో మాత్రం రావద్దు!' అంది ముసలమ్మ ఆమె మాట అన్న లెక్క పెట్టలేదు.

నాలుగోనాడు, ముసలమ్మ కొడుకు పోలీసు కానిస్టేబుల్ వచ్చాడు. అన్న దగ్గరకువచ్చి, మునిగాళ్ల మధ్య డబ్బా పెట్టుకొని, కూర్చున్నవాణ్ణి, జుట్టు పట్టుకొని, పైకి లేవనెత్తి డబ్బా మూతతీసి, అప్పుడే బైటికివస్తున్న పిల్లల్ని పిలిచి 'తీసుకోండి' అన్నాడు.

అన్న గింజుకొన్నాడు. పిల్ల లెవరూ రాలేదు. ఒకడు ధైర్యంగా వచ్చాడు. ఐస్ ఫ్రూట్ తీసుకొన్నాడు. అన్న ఏడుపుముఖం పెట్టాడు. పిల్లలు బిలబిల లాడుతూ వచ్చారు. చేతికి అందినవన్ని తీసుకున్నారు. వెళ్లిపోయారు. డబ్బా కాళీ అయింది.

డబ్బామీద మూతలేదు. డబ్బాలో ఐస్ ఫ్రూట్ లు
వు. జేబులో డబ్బులు లేవు. జుత్తు పోలీసు కానిస్టేబుల్
తిలో వుంది. పిల్లలు వెళ్లుతున్నారు. వాళ్లతో పాటు ఐస్
ఫ్రూట్ లు వెళ్లుతున్నాయి.

మెదడులో ఏదో ఉండ చుట్టుకుపోతుంది! భూమి అంత
ంద్రని ఉండ! తల తిరిగిపోతూవుంది. ఉండ ఉబ్బుతున్న
లూన్‌లాగా అయింది. కళ్లు తిరిగిపోయాయి, ఆ వురుమని
ోరు తెరచి, అమ్మని ఎరుగనివాడు, 'అమ్మా!' అంటూ
డుస్తూ కూర్చుండి పోయాడు. ముక్కు కాళ్లు అదురు
ున్నాయి. పెదాలు వణుకుతున్నాయి.

'లే! లే! ఇక్కడ! రేపు వచ్చావంటే చంపుతాను'
ూర్చుండి పోయిన అన్నను బూటు కాలుతో తన్నాడు పి.సి.

బూటుకాలు దెబ్బ దెబ్బే కాదు. అటువంటి దెబ్బలెన్నో
న్నాడు. వంటిమీద దెబ్బకంటే గుండెమీద దెబ్బకు
దులు లేక, కాళీడబ్బా తీసుకొని, ఏకాకిలా రోడ్డుమీద
డుస్తున్నాడు అన్న!

ఆరాత్రి, థర్డ్ క్లాసు వెయిటింగ్ హాలులో మూలన తమ్ముణ్ణి
ుపులో దాచుకొని ఏడుస్తూ సంగతంతా చెప్పి, 'నువ్వయితే
లా చేస్తావా' అని అడిగితే 'చేయను' అన్నాడు ఏమీ
ర్థంకాని తమ్ముడు.

ఆ రోజు వాన కురిసింది. చిత్తడిగా వుంది. ఈదురుగాలి.
లి! నేలంతా బురద! రొచ్చు! రోత!

తమ్ముణ్ణి వదిలిపెట్టి ఎక్కడికిపోలేని అన్న దొంగతనంగా
ామాన్లు మోస్తున్నాడు. లైసెన్సు కూలీలతిట్లు దీవెనలుగా
ంటున్నాడు.

వంటిమీద పడ్డ నీళ్లు తుడుచుకోకుండా నీళ్లుగారి పోతు
వుంది రైలు.

ఒక పెట్టెలోంచి నవదంపతులు దిగారు, 'బాబు కూలీ
అమ్మ కూలీ!' అంటూ దగ్గరకు వెళ్లాడు అన్న.

'ఈ సామాను మోస్తావా?'

'ఆఁ!'

నెత్తిమీద పెద్ద పెట్టే, దానిపైన బెడ్డింగు, చంకలో బుట్ట
— అన్న దంపతుల వెంట నడుస్తున్నాడు. పెట్టెలో పెళ్లి
ఉత్సాహమే వుందో, దాంపత్యమే దాగివుందోగాని బరువుగా
వుంది. బరువుకు మెడ వూగిపోతూ వుంది. చేయి పీక్కు
పోతూ వుంది.

'త్వరగా నడవోయ్!'

క్రొత్త పెళ్లికొడుకు ఉత్సాహం కేక వేసింది.

గేటుదాటి, హాలుదాటి, రిక్షాస్టాండ్ దగ్గరకు వచ్చేసరి
అన్నకు తూలు వచ్చింది. తడి నేలమీద కాలు జారింద
కూలబడ్డాడు.

మెలకువ వచ్చేసరికి, వెయిటింగ్ హాలు ప్రక్క గోడవార
పడుకొని వున్నాడు. లైసెన్సుకూలీ ఒకాయన ముఖంమీ
నీళ్లు జల్లుతున్నాడు.

కళ్లు తెరచి చూస్తే నవదంపతులు లేరు. సామానులేద
డబ్బులులేవు. మెడ మాత్రం కదలటంలేదు. కాలి బొట
వ్రేలు చిటికింది.

లేచి కూర్చుని చుట్టూ చూశాడు. ఏడుపు వచ్చిం
వెలుపలికి రాలేదు. ప్రేగుల్లో ఇటుకావ కాలుతూవుం

ఇది అన్యాయం! ఇది బ్రతుకుకాదు. ఇది జీవించటం కాదు. ఇది చావుగాదు. చావు బ్రతుకుల సంధికాదు. లోకంకాదు. ధర్మంకాదు.

ఎందుకీగతి? కొందరికే ఎందుకీ దురవస్థ? ఎందుకిలా అయిపోవాల? దీని హద్దెక్కడ?

ఇది సహజంకాదు. ఇది స్టేషన్ గుండెపైన పుండు. లోకం కణతమీద కణితి!

ఎక్కడో దారం తెగింది. ఇక్కడ మెడ నరాలేకాదు, ఏమయినా తెగుతాయి. సృష్టి మాత్రం తిన్నగా సాగటం లేదు. ఆ దారం ముడిపడింది తెగిపోయింది.

రాత్రి తమ్ముణ్ణి గుండెలకద్దుకొని, మెడరాసుకొంటూ 'మనం ఇలాగేనా బ్రతుకవలసింది? ఇలాగేనా? ఇలాగేనా?' అంటే 'అవును ఇలాగే!' అన్నాడు ఏమి అర్థంకాని తమ్ముడు.

లోకంలో ఎంతమంది పిల్లల్లేరు? అందరూ ఇలాగే బ్రతుకుతున్నారా? ఇలాకాదు బ్రతుకవలసింది. మరోలా బ్రతికాలి! ఎలాగో తెలియలేదు.

అనాథాశ్రమంలో కూడా వీళ్లు దిక్కులేనివాళ్లు అని చెప్పే దిక్కయినా లేకపోతే చోటులేదని తెలుసుకొన్న అన్న దేవుడే దిక్కనుకొన్నాడు.

ప్రయత్నాలు విఫలమయి, ఆకలి అధికమయి, గూడువిడిచి పారిపోవాలనుకొన్న పక్షులు, గత్యంతరలేక, మళ్లీ గూటికి చేరుకొన్నాయి. స్టేషన్ జీవితం మళ్లీ మామూలయింది.

రాడీకోసం వెతుకుతున్నారు జీతగాళ్లు. పార్కులో కనిపించ లేదు. రేడియో గదిలోంచి వెలుపలికి వచ్చిన రైతు 'ఏందిరా గాడిదల్లారా ఈడ దిరుగుతున్నారు' అని ప్రశ్నించాడు.

జీతగాళ్లు జవాబు చెప్పలేదు.

'మా జీతగాడేడి?'

కంచెలో రాడీకోసం చూస్తున్నాడు.

'ఏందిరా నువ్వొతికేది?' రైతు అడిగాడు.

'ఏంలే!'

ఆ జీతగాడు నాలుగు రోజుల్నాడు అన్నదమ్ములతో తగాదా పడ్డాడు.

'ఎదవకాన! ఏడొదిలిపెట్టావ్ గొడ్డు! దున్నదిన్నట్టు తింటమే గానీ గొడ్డుమేపేదిలే! ఏ చేలోనన్నాబడితే బందిల్దొడ్డిలో పెడ తారుపో! ఈడ గనపడితే మక్కెలి రగదంతా పోవేం!' కర్రతో రెండంటించాడు.

జీతగాళ్లు వెనుదిరిగారు.

అన్నదమ్ములిద్దరూ, నాలుగురోజుల్నాడు, దేవాలయంలో కొబ్బరికాయ గొట్టి, ప్రక్కనున్న కాలువలో దిగాడు.

అంతలో జీతగాళ్లు గొడ్డు దోలుకువచ్చి, జట్లుగా గట్టు మీద నిలబడ్డారు.

'అడుగో రాడీ! అల్లే! ఆళ్లిద్దరే!'

దెబ్బలు, — ఉదయం స్టేషన్ దగ్గర, — చిన్న జీతగాడు చెప్పాడు.

'రండీ! ఒడ్డుకు రండిరా!!

జీతగాళ్లు కేకేశారు.

అన్నకు భయం కలిగింది.

'వద్దురా! ఎక్కొద్దు! ఒడ్డెక్కొద్దురా! కొడతారు!

తమ్ముడు భయపడిపోయాడు.

కాలువలో క్రొత్త నీరు ముమ్మరంగా వస్తూవుంది.

వాళ్లెంతకి ఒడ్డెక్కలేదు. జీతగాడు రాయి విసిరాడు. అందరూ రాళ్లు విసురుతున్నారు. అన్నదమ్ములకు తగులుతున్నాయి.

రాళ్ల దెబ్బలు తప్పించుకోవాలంటే నీళ్లల్లో మునిగి వుండాలి. నీళ్లలో మునిగి ఇక్కడనుంచిపోయి అక్కడ తేలటం వాళ్లకు చేతగాదు. ఈతరాదు!

రాళ్ల దెబ్బలు తప్పుకోవటంకోసం తమ్ముడే వెనక్కు వెళుతున్నాడు. కాలుకు నేల అందటంలేదు. కాలువ జోరుగా పోతూవుంది.

పట్టణంనుంచి వస్తున్న సుబ్బారావు సైకిల్‌తో కాలువ వంతెనమీదకు వచ్చాడు.

మనిషి బాగాలావు. ఎప్పటికయినా భార్య మగపిల్లవాణ్ణి కనకపోతుందా అనే ఆశతో తొమ్మిదిమంది ఆడపిల్లలకు తండ్రి అయ్యాడు.

సుబ్బారావు కూర్చుంటే సైకిల్ పటపటలాడుతుంది. జట్కాగుఱ్ఱం సకిలించినట్లు మూలిగికాని సైకిల్ ముందు చక్రం ముందడుగు వేయదు. అతనంటే ఊళ్లో అందరికీ తెలుసు. అతనిదగ్గర వడ్డీకి తీసుకొన్నడబ్బు కోర్టు వ్యవహారం లేకుండా ఎవరూ ఇవ్వరు. జీతగాళ్లు అతన్ని చూశారు. మామూలుపాట ప్రారంభించారు.

సుబ్బరావు! సుబ్బరావు!

సుబ్బరావు! దుబ్బరావు!

సుబ్బరావు! సుబ్బరావు!

సుబ్బరావు! డబ్బురావు!

డబ్బురావు! మబ్బురావు!

మబ్బురావు! దిబ్బరావు!

సుబ్బరావు! దిబ్బరావు!

డబ్బురావు! మబ్బురావు!

జీతగాళ్లు రాళ్లు విసురుతూ ఎగరటం ప్రారంభించారు. అతను పరిస్థితి గమనించాడు. వంతెనమీద సైకిల్ ఆపి, 'ఆగండ్రా గాడిదల్లారా' అంటూ వస్తున్నాడు.

కాలువలో తమ్ముడు కాలు నేలమీద ఆనక 'అన్నా అన్నా!' అన్నాడు.

అన్న చేయి అందించాడు. అందలేదు. చివరిసారి రాళ్ల వర్షం నీటిమీద జోరుగా కురిసింది. కాలువనీళ్లు చింధరవందరగా లేచాయి. తమ్ముడికోసం లోపలికి పోతున్నాడు. నేల తగలటం లేదు. తమ్ముడు అంధలేదు. 'అన్నా! అన్నా!' వినిపించింది. సరిగ్గా చూస్తే తమ్ముడు కనిపించలేదు. అన్నకు ఏడుపు వచ్చింది. నోట్లోకి నీళ్లుపోయాయి. తమ్ముడు ప్రవాహంలో కొట్టుకు పోతున్నట్లు కనిపించినట్లయింది. ఎవడ్రా అది. ఏదో కేక. ఏమీ వినిపించలేదు.

అన్నకు స్పృహ వచ్చేసరికి సుబ్బారావు ఇంట్లో వున్నాడు.

'తమ్ముడేడి?'

'ఉన్నాలే!'

'ఏడ?'

'పక్కింట్లో ఉన్నాలే?

అన్న పూర్తిగా కోలుకొన్న తర్వాతకూడా తమ్ముడు కనపళ్లేదు.

అన్న ఏడవలేదు. ఆకాశంలో చూశాడు. అక్కడా ఏడ్పులేదు.

'అన్నా! అన్నా!' అన్న ధ్వని తప్ప మరేమీ వినిపించటం లేదు.

నాలుగు రోజులు సుబ్బారావు ఇంట్లోనే అన్న ఉన్నాడు.

ఇంక ఉండ బుద్ధి పుట్టలేదు. వెళ్లిపోవాలనిపించింది.

ఉదయమే వెలుపలికి వచ్చాడు. కాలువ గట్టుమీద చింత చెట్టుక్రింద కూర్చుని తదేకధ్యానంగా చూస్తూ వుండి పోయాడు.

గడ్డివాముల మధ్య ఏదో అలికిడి అయింది.

అన్న కళ్లు తిప్పిచూశాడు. కళ్లు పెద్దవి చేసుకొని చూశాడు. అదిరిపోయాడు. పాము! చుట్ట చుట్టుకొని పడు కొని వుంది.

ఒక్క ఉదుటన లేచి వెలుపలికి వచ్చాడు. సావిళ్లుదాటి డొంకలోకి వచ్చాడు.

అప్పటిదాకా వెతికి తిరిగి వస్తున్న జీతగాళ్లు అన్నను చూశారు.

'అదుగో రాడే!' అరిచారు.

జీతగాళ్లను చూచేసరికి గుండె ఆగిపోయినంత పనయింది.

దూరంగా రైలుకూత వినిపించింది.

అడ్డబాటన స్టేషన్ వైపు పరుగెత్తు తున్నాడు.

స్టేషన్ ప్రక్క ఎడ్లబళ్లు పోయేందుకు వీలుగా గేటువుంది. అక్కడకు వచ్చాడు.

వెనుకనుంచి జీతగాళ్లు—పిల్లలు! ముందునుంచి—స్కూలుకు పోయి తిరిగివస్తున్న పిల్లలు—ముందువెనుకల పిల్లలు! మధ్యలో పిల్లవాడు—అన్న.

'పట్టుకోండి! పట్టుకోండి!'

వెనుకనుంచి అరుపులు! ముందునుంచి పిల్లలు!

ఫర్లాంగుదూరంలో స్టేషన్. అక్కణ్ణుంచి రైలుదేరిన గూడ్సు వేగం పుంజుకొంటూ వుంది. ఇటునుంచి పట్టణం పోయే రైలు వేగం తగ్గించుకొంటూ వస్తూవుంది.

అటుప్రక్క బడిపిల్లలు నిలబడిపోయారు. ఇటుప్రక్క జీతగాళ్లు ఆగిపోయారు, మధ్యలో — గేటు మధ్యలో అన్న అటు బడిపిల్లలు! ఇటు జీతగాళ్లు! అటు గూడ్సు! ఇటు రైలు! మధ్యలో—సమాంతరంగా అన్న!

పరిస్థితి పరికించాడు. తలవంకించాడు. నిలబడిపోయాడు. అటు పట్టాలు! ఇటు పట్టాలు? అటు గూడ్సు! ఇటు రైలు!

రైలు తన పట్టాలమీద తాను వస్తూవుంది. గూడ్సు తన పట్టాలమీద తాను వెళుతూవుంది. బడిపిల్లలు జీతగాళ్లు తమ తమ తావుల్లో ఆగిపోయారు. అన్న తన స్థలంలో తానున్నాడు. లోకంలో అందరికీ అన్నింటికీ స్థలం వుంది! తనకు? ఉందా?—లేదా?

అన్న అటు పోబోయాడు గూడ్సు ఇంజన్ గేటులోకి వచ్చేసింది ఇటు పోబోయాడు రైలింజన్ వచ్చేసినట్లయింది.

గేటులో ఇంజన్లు!

పిల్లలు బిళ్లంగోను ఆడుకొంటారు. దేవుడు ఆడుకొంటే వింత!

శత్రువు బుల్లెట్లు తప్పించుకొనేందుకు ఏదో షీల్డు దొరుకుతుంది. విధి బుల్లెట్?

జీవన సంగ్రామంలో రైలో గూడ్సో యమదూత అయినా అవుతాయి, బుల్లెట్ల బారినుంచి రక్షించే షీల్డ్‌లు అన్నా అవుతాయి.

గూడ్సు ఇంజన్ చక్రాలు వేగం పుంజుకొంటున్నాయి. కటకటలాడుతున్నాయి.

రైలింజన్ చక్రాలకు బ్రేకులు పడుతున్నాయి. కటకటలాడుతున్నాయి.

గేటులో నాలుగు రైలు పట్టాలుమీద రెండు ఇంజనులు రెండు తోవలకు వెళ్లిపోతున్నాయి.

ఒక చక్రం అటు పోతూవుంది. ఒక చక్రం ఇటు పోతూవుంది. చక్రం ప్రక్క చక్రం! చక్రం తర్వాత చక్రం.

పట్టాలమీద చక్రాలు అతి తేలికగా సునాయాసంగా నిర్భయంగా దొర్లిపోతున్నాయి.

చక్రం! ఇంకో చక్రం! మరో చక్రం! చక్రాలు! చక్రాలు!

గూడ్సు పూర్తిగా గేటుదాటింది!

రైలు స్టేషన్‌దాకా వెళ్లిపోయింది!!

అన్న?